సాక్షి
వికారాబాద్

సోమవారం, 1, మే, 2023



నిధులు.. విధులు శూన్యం

వ్యవసాయధికారులు, అన్నదాతలకు అనుసంధాన కర్తలుగా నిలవాల్సిన రైతుబంధు సమితులు నామమాత్రంగా మారాయి. 8లో▸



హక్కుల సాధనకు సమ్మెలు

ఉద్యోగులు, కార్మికులు సమ్మె బాట పడుతున్నారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతున్నారు. 8లో▸



విపత్తులతో రైతన్న విలవిల

అకాల వర్షాలతో అన్నదాతలు అల్లాడిపోతున్నారు. పంటలు చేతికొచ్చే వేళ నీటిపాలవుతున్నాయి. 9లో▸

న్యూస్‌రీల్

నేడు మెగా హెల్త్ క్యాంప్

అనంతగిరి: మేడే సందర్భంగా వికారాబాద్‌లో సోమవారం మెగా హెల్త్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు సహాయ కార్మిక కమిషనర్ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కామన్ సర్వీస్ సెంటర్ హెల్త్ కేర్ వారి ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికుల కోసం వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో దాదాపు 50 రకాల వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మే 1 నుంచి 3 వరకు వికారాబాద్ పట్టణంలోని సరస్వతి శిశు మందిరంలో హెల్త్‌క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని భవన నిర్మాణ కార్మికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 63018 77352 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

'ఇసుక రవాణా'పై కలెక్టర్ ఆరా!

నివేదిక పంపిన తహసీల్దార్ గోవిందమ్మ

యాలాల: బాగాయిపల్లి సమీపంలో ప్రజాప్రతినిధులు అడ్డుకున్న నాలుగు ఇసుక టిప్పర్ల ఘటనపై కలెక్టర్ నారాయణరెడ్డి ఆరా తీశారు. కొడంగల్ పట్టణంలో జరుగుతున్న డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణంతో పాటు ఇతర అభివృద్ధి పనులకు బొంరాస్‌పేట తహసీల్దార్ ఇసుక తరలింపునకు అనుమతులు జారీ చేసిన విషయం విదితమే. సాయంత్రం వేళ టైం దాటినప్పటికీ టిప్పర్లలో ఇసుక రవాణా జరుగుతుండటంతో బాగాయిపల్లి సమీపంలో పగిడియాల ఎంపీటీసీ రాములు, సొసైటీ డైరెక్టర్లు అశోక్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డిలు అడ్డుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి ఆదివారం 'సాక్షి'లో 'యథేచ్ఛగా ఇసుక తరలింపు' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన కలెక్టర్ నారాయణరెడ్డి యాలాల తహసీల్దార్ గోవిందమ్మకు ఫోన్‌లో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలను నివేదించాలని ఆదేశించారు. కాగా బొంరాస్‌పేట తహసీల్దార్ ఇసుక అనుమతులను దువ్వచర్ల పరిధిలోని కాకరవేణి నది నుంచి ఇవ్వగా, తరలింపు మార్గం యాలాల మండల పరిధిలోని మూడు గ్రామాల నుంచి ఉండటంతో స్థానిక ప్రజాప్రతినిధులు వాహనాలను అడ్డుకున్నారు. రోజుకు ఒకే ట్రిప్పు ఇసుక తరలింపు అనుమతులు ఉండగా, బొంరాస్‌పేట మండల అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టారాజ్యంగా ఇసుక రవాణా సాగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

కుక్కల దాడిలో జింక మృతి



మృతి చెందిన జింక

పూడూరు: కుక్కల దాడిలో జింక మృతి చెందిన ఘటన మండల పరిధిలోని దామగుండం అటవీ ప్రాంతంలో చోటు చేసుకుంది. స్థానికులు, పశువుల కాపరులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దామగుండం అటవీ ప్రాంతం నుంచి వికారాబాద్ వెళ్లే దారిలో జింకపై కుక్కలు దాడి చేశాయని తెలిపారు. అటవీ అధికారులకు సమాచారం ఇవ్వడంతో పూడూరు పశువుల అస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందిందని అధికారులకు తెలిపారు. జిల్లా పశువుల ఆస్పత్రికి తరలించి పోస్టు మార్టం నిర్వహించినట్లు అటవీ అధికారులు తెలిపారు.

ఆ నాలుగు గ్రామాలు ఇక వికారాబాద్‌లోనే..

అనంతగిరి: ధారూరు మండల పరిధిలోని గోధుమగూడ, జైదుపల్లి, సర్పన్‌పల్లి, రాళ్ల చిట్టంపల్లి గ్రామాలను కొన్ని సంవత్సరాలు క్రితం వికారాబాద్ మండలానికి మార్చారు. కానీ పోలీస్‌స్టేషన్ పరిధి మాత్రం ధారూరు పోలీస్‌స్టేషన్‌లోనే ఉంచారు. ప్రస్తుతం ఈ నాలుగు గ్రామాలను వికారాబాద్ పీఎస్ పరిధికి మార్చినట్లు డీఎస్పీ సత్యనారాయణ తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు పోలీసు సేవల కోసం వికారాబాద్ పీఎస్‌ను సంప్రదించాలన్నారు.

ఉత్సాహంగా శారీరన్

శంకర్‌పల్లి: వ్యాయామంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని బ్యాడ్మింటన్ క్రీడాకారిణి కృష్ణప్రియ, హైదరాబాద్ రన్నర్స్ ప్రతినిధి కిరణ్మయి, సామాజిక కార్యకర్త వాణి పేర్కొన్నారు. మండలంలోని మోకిల గ్రామంలో ఆదివారం మహిళలతో శారీరన్ కార్యక్రమం చేపట్టారు. 3.5 కే, 5కే రన్, వాకింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు వంటింటికే పరిమితం కాకుండా యోగా, రన్నింగ్, వాకింగ్‌లను అలవాటు చేసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మోకిలలోని విల్లాలు, అపార్ట్‌మెంట్లలో ఉండే మహిళలు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు.











శుభాకాంక్షల వెల్లువ

రాష్ట్ర నూతన సచివాలయం ప్రారంభోత్సవం సందర్భంగా జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు సీఎం కేసీఆర్‌ను, మంత్రులు సబితారెడ్డి, దయాకర్‌రావు, నిరంజన్‌రెడ్డిలను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, పట్నం నరేందర్‌రెడ్డి, మహేశ్‌రెడ్డి, బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్ తదితరులు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కొత్త సచివాలయాన్ని తెలంగాణకు తలమానికంగా నిర్మించారని కొనియాడారు.

పోడుకు క్లియర్.. ఉద్యోగులు బేఫికర్

పలు ఫైళ్లపై సీఎం కేసీఆర్ సంతకం

- లబ్ధిదారుల్లో ఆనందోత్సాహాలు
- 165 మంది కాంట్రాక్టు ఉద్యోగులు రెగ్యులరైజ్
- 11,073 మందికి జీవాలు
- 436 మందికి పోడు పట్టాలు
- పట్టాలెక్కనున్న గృహలక్ష్మి పథకం
- ఇక అంగన్‌వాడీల్లో సన్నబియ్యం



వికారాబాద్‌లో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు

వికారాబాద్: సీఎం కేసీఆర్‌తో పాటు మంత్రులు పలు ఫైళ్లపై సంతకాలు చేయడంతో ఆశావహులు, లబ్ధిదారుల్లో ఆనందోత్సాహాలు మిన్నంటాయి. ఆదివారం రాష్ట్ర నూతన సచివాలయం ప్రారంభోత్సవం అనంతరం అందులో కొలువుదీరిన సీఎం, మంత్రులు ఆ వెంటనే పెండింగులో ఉన్న పలు ఫైళ్లపై సంతకాలు చేశారు. దీంతో ఏళ్లుగా ఎదురు చూస్తున్న లబ్ధిదారులకు ఊరట లభించింది. ఇందులో ప్రధానంగా కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడం, పోడు లబ్ధిదారులకు పట్టాలివ్వటం, గృహలక్ష్మి పథకం అమలు, రెండో విడత గొర్రెల పంపిణీకి నిధుల విడుదల, అంగన్‌వాడీ చిన్నారులకు సన్నబియ్యం, పాలు పంపిణీ, కొత్త పోలీస్ స్టేషన్ల నిర్మాణానికి నిధుల విడుదల, రెండో విడత దళిత బంధు పథకానికి నిధుల విడుదల తదితర పథకాలకు సంబంధించి ఫైళ్లపై సంతకాలు చేయడంతో లబ్ధిదారుల్లో ఆనందం వెల్లివిరిస్తోంది. దీంతో వారు వారి యూనియన్లు, సంఘాల ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేయడంతో పాటు స్వీట్లు పంచుకున్నారు.

ఎట్టకేలకు ఫైల్‌పై సంతకం

కాంట్రాక్టు ప్రాతిపదికన విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని సీఎం కేసీఆర్ అధికారం చేపట్టకు ముందు హామీ ఇవ్వగా ఇటీవలి బడ్జెట్‌లో రెగ్యులరైజ్ చేస్తూ బడ్జెట్ కేటాయింపులు చేసిన విషయం తెలిసిందే. అయితే దానికి సంబంధించి ఫైలు మాత్రం ముందుకు కదలలేదు. వారికి మళ్లీ ఎదురు చూపులు తప్పలేదు. ఎట్టకేలకు ఆదివారం సీఎం కేసీఆర్ ఆ ఫైల్‌పై సంతకం చేయడంతో జిల్లాలో జూనియర్ కళాశాలలు, పశు సంవర్ధక శాఖ, హెల్త్ డిపార్ట్‌మెంట్లలో కాంట్రాక్టు ప్రాతిపదికన విధులు నిర్వహిస్తున్న 165 మంది ఉద్యోగులు రెగ్యులరైజ్ కానున్నారు.

మరిన్ని ఫైళ్లపై సంతకాలు...

మంత్రులు సైతం పలు ఫైళ్లపై సంతకాలు చేయటంతో పలువురు లబ్ధిదారులకు ఊరట లభించనుంది. రెండో విడత గొర్రెల పంపిణీ పథకం ఫైల్‌పై సంతకం చేసిన నేపథ్యంలో 11,071 మంది గొర్రెల కాపరుల సహకారం సంఘం సభ్యులకు జీవాలు పంపిణీ చేసేందుకు మార్గం సుగమం అయ్యింది. వ్యక్తిగత స్థలాలు ఉన్న వారికి రూ. 3 లక్షలతో ఇళ్లు నిర్మించుకునేందుకు అవకాశం కల్పించే గృహలక్ష్మి పథకం ఫైల్‌మీద కూడా సంతకం చేయడంతో జిల్లాలో 10 నుంచి 12 వేల ఇళ్ల నిర్మాణానికి నిధులు కేటాయించనున్నారు. అంగన్ వాడీ కేంద్రాలకు సన్నబియ్యం పంపిణీ పథకానికి సంబంధించిన ఫైల్ పై కూడా సంతకం చేశారు. దీంతో జిల్లాలో 1,106 అంగన్ వాడీ కేంద్రాల్లో లబ్ధిపొందే 18,219 మంది చిన్నారులు, 6,313 మంది గర్భిణులు, 5,683 మంది బాలింతలకు లబ్ధి చేకూరనుంది. చిన్నారులకు పాల పంపిణీ కూడా జరగనుంది. నూతన మండలాల్లో పోలీస్‌స్టేషన్ల నిర్మాణానికి నిధులు కేటాయించే ఫైల్‌పై కూడా సంతకం చేయడంతో అధునాతన పోలీస్ స్టేషన్ భవనాలు నిర్మించనున్నారు.

'పోడు' లబ్ధిదారులకు ఊరట

సీఎం కేసీఆర్ పోడు భూముల పట్టాల పంపిణీ ఫైల్‌పై కూడా సంతకం చేశారు. దీంతో పోడు లబ్ధిదారులకు ఊరట లభించింది. జిల్లాలో 9,647 మంది తమకు పోడు హక్కులు కల్పించాలని ఏడాది క్రితం దరఖాస్తు చేసుకున్నారు. కసరత్తు అనంతరం ఇందులో 436 మంది అర్హులుగా అధికారులు తేల్చారు. వీరికి 552 ఎకరాల భూమికి సంబంధించి ప్రభుత్వం పోడు పట్టాలు ఇవ్వనుంది. అధికారులు వీటికి సంబంధించి ఇప్పటికే పాసు పుస్తకాలు తయారు చేయటంతో పాటు వాటిపై సంబంధిత శాఖ అధికారులు సంతకాలు చేసి సిద్ధంగా ఉంచారు. సీఎం కేసీఆర్ ఆ ఫైల్‌పై సంతకం చేసిన నేపథ్యంలో పట్టాల పంపిణీకి లైన్ క్లియర్ అయినట్టయ్యింది.



పరిగి: తుంకుల్‌గడ్డ సమీపంలో జాతీయ రహదారిపై పడిన భారీ సూచిక బోర్డు

పరిగిలో భారీ వర్షం

- ఈదురు గాలులలో కూలిన చెట్లు
- రహదారిపై స్తంభించిన ట్రాఫిక్



అనంతగిరి: వికారాబాద్‌లో కురిసిన వర్షానికి జలమయమైన రహదారి

పరిగి: మండల వ్యాప్తంగా ఆదివారం రాత్రి భారీ ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. గంట పాటు కురిసిన వర్షానికి హైదాబాద్- బీజాపూర్ జాతీయ రహదారిపై పలు చోట్ల భారీ వృక్షాలు నేలకూలాయి. సూచిక బోర్డులు పడిపోవటంతో ట్రాఫిక్ స్తంభించింది. సయ్యద్‌మల్కాపూర్ సమీపంలో మామిడి చెట్టు విరిగి పడటంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆయ గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో గ్రామాల్లో, పట్టణ కేంద్రంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

వికారాబాద్‌లో..

అనంతగిరి: వికారాబాద్‌లో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులు, ఉరుములతో కూడిన వర్షం కురిసింది. ఒక్కసారిగా వర్షపు నీరు రోడ్లపై పారింది.

దేశభక్తిని పెంపొందించాలి

- మానవీయ విలువలు పెరగాలి
- అఖిల భారతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ సుశీల్ చంద్ర త్రివేది

అనంతగిరి: సాహిత్యంతో సమాజంలో నైతిక, మానవీయ విలువలు పెంపొందించాలని అఖిల భారతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ సుశీల్ చంద్ర త్రివేది అన్నారు. సాహితి సమితి స్వర్ణోత్సవాల సందర్భంగా ఆదివారం వికారాబాద్‌లో జాతీయ సాహిత్య పరిషత్ మహాసభలు జరిగాయి. వివిధ జిల్లాల నుంచి కవులు, రచయితలు, సాహిత్య అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుశీల్ చంద్ర త్రివేది మాట్లాడుతూ సాహిత్యంతో దేశభక్తి, జాతీయ భావాలు పెంపొందించాలన్నారు. భారతదేశ ఆచార వ్యవహారాలను, సంస్కృతిని కాపాడే రచనలు చేయాలని కవులకు సూచించారు. అనంతరం జాతీయ సాహిత్యం, వ్యక్తిత్వ వికాసం, భారతీయ సాహిత్యంపై వక్రీకరణలు–వాస్తవాలు అనే అంశాలపై సదస్సు జరిగింది. ఈ అంశాలపై ప్రముఖ కవి డాక్టర్ భాస్కరయోగి, మావుడవాడీ సూర్యనారాయణ మూర్తి ఉపన్యాసం ఇచ్చారు. కవులు, రచయితలు సామాన్యులకు పిల్లలకు అర్థమయ్యే అవసరమైన రచనలు చేయాలని జాతీయ సాహిత్య పరిషత్ ప్రాంత అధ్యక్షుడు కసిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సమావేశాలలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన కవులు 15 పుస్తకాలను ఆవిష్కరించారు. మాతృభాషలో విద్యాబోధన జరగాలని, దేశభక్తిని నిర్మాణం చేసే పాఠ్యాంశాలు ఉండాలని, సాహిత్యం, సంస్కృతితో ఏకాత్మ భావన నిర్మాణం కావాలని భారతదేశ వాస్తవ చరిత్ర నిర్మాణం కావాలని ఈ సమావేశంలో తీర్మానించారు. సమావేశంలో రచయితలు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

కరుణించు మాతా..

వైభవంగా కన్యకాపరమేశ్వరి ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

అనంతగిరి: వాసవీ కన్యకా పరమేశ్వరి మాత ఉత్సవాలు ఆదివారం వికారాబాద్‌లో వైభవంగా జరిగాయి. స్థానిక రామ మందిరంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాల అనంతరం ప్రత్యేక అలంకరణ చేశారు. మహిళలు కలశాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేశ్‌కుమార్ దంపతులతో పాటు పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు. సాయంత్రం అమ్మవారి శోభాయాత్ర నిర్వహించారు. ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, ఆర్యవైశ్య సంఘం నాయకులు, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



కలశాలతో ఆర్యవైశ్య మహిళలు

గనుల లీజులు ఇక చకచక

- ఆన్‌లైన్‌లో వేలం
- మైనింగ్ శాఖ కొత్త పాలసీ
- దరఖాస్తుల స్వీకరణ షురూ..



నాపరాతి గని

తాండూరు: అక్రమ మైనింగ్‌కు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం కొత్త పాలసీ అమలు చేస్తోంది. ప్రభుత్వ, పట్టా భూముల్లో ఉన్న వనరులను లీజ్ పద్ధతిలో తవ్వుకునేందుకు అనుమతులు ఇస్తోంది. ఆన్‌లైన్ ద్వారానే గనుల లీజ్ వేలం వేయనున్నారు. ఈ నెల 22 నుంచే దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. పెద్దేముల్, నవాబ్‌పేట, పూడూరు, ధారూరు, మోమిన్‌పేట, వికారాబాద్, కొడంగల్ మండలాల్లో ఎర్రమట్టి, గ్రానైట్ నిక్షేపాలున్నాయి. తాండూరులో నాపరాయి, ఎర్రమట్టి ప్రధాన వనరులు ఉండగా పెద్దేముల్ మండలంలో సుద్దం, గ్రానైట్ స్టోన్ (కంకర), ఎర్రమట్టి, నవాబ్‌పేట, మోమిన్‌పేట, పూడూరు మండలాల్లో ఎర్రమట్టి నిక్షేపాలున్నాయి. గనుల నిక్షేపాలతో తాండూరు పారిశ్రామిక ప్రాంతం ఖ్యాతి గాంచింది. నాపరాతి గనులు, సుద్ద, ఎర్రమట్టి, బంకమట్టి, గ్రానైట్ వంటి నిక్షేపాల వ్యాపారం జోరుగా సాగుతోంది. అలాగే నాపరాతి గనుల ద్వారా బండరాయిని వెలికి తీసి పాలిషింగ్ చేసి దేశ, విదేశాలకు రావాణా జరుగుతోంది.

అక్రమ మైనింగ్ అరికట్టేందుకే..

ఇటీవల కాలంలో అక్రమ మైనింగ్ జోరుగా సాగుతుండటంతో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ నేపథ్యంలోనే మైనింగ్ శాఖలో కొత్త పాలసీ ప్రవేశపెట్టింది. కొత్త పాలసీతో గని తవ్వకాల సీనరేజ్ పెంచడంతో పాటు లీజ్‌పై అనుమతులు ఇచ్చేందుకు శ్రీకారం చుట్టింది. గనుల శాఖ ద్వారా జిల్లా నుంచి 2022–23 సంవత్సరంలో రూ.115కోట్లు ఆదాయం సమకూరింది. అందులో మేజర్ మినరల్స్ నుంచి రూ. 30.63కోట్లు, మైనర్ మినరల్స్ ద్వారా రూ.84.63కోట్ల ఆదాయం గనుల శాఖ ఖజానాకు చేరింది. రానున్న రోజుల్లో ఆదాయం మరింత పెరిగే అవకాశం ఉంది.

అనుమతులు సులభతరం

ప్రభుత్వ భూముల్లో ఖనిజాలు తవ్వేందుకు ప్రభుత్వం అనుమతులు సులభతరం చేసింది. ఈ నెల 22 నుంచి ఖనిజ వనరులు ఉన్న భూముల లీజ్‌ను వేలం వేసేందుకు నోటీసులు జారీ చేసింది. ఇప్పటికే నవాబ్‌పేట, మోమిన్‌పేట, పూడూరు మండలాల్లో ఎర్రమట్టి కలిగిన ప్రభుత్వ భూముల వేలం కోసం దరఖాస్తులు స్వీకరించారు. 70 ఎకరాల భూములను లీజు తీసుకొనేందుకు దరఖాస్తులు అందాయి. మరోవైపు తాండూరు, బషీరాబాద్ మండలాల్లో ప్రభుత్వ భూముల్లో ఉన్న నాపరాయి గనుల తవ్వకాలకు లీజ్ పద్ధతిలో వేలం వేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

పట్టా భూముల్లో..

పట్టా భూముల్లో ఖనిజ నిక్షేపాల తవ్వకాలకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వనున్నారు. అందుకోసం గనుల శాఖ మార్గదర్శకాలను జారీ చేసింది. పట్టా భూమి కలిగిన రైతు గని అనుమతులు పొందేందుకు ఆన్‌లైన్ ద్వారానే దరఖాస్తు చేసుకొనే అవకాశం కల్పించింది. అందుకోసం గనుల శాఖ పోర్టల్‌లో రూ.లక్ష చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి. అనుమతులు పొందాక ప్రభుత్వ ఫీజు కంటే పది రెట్లు పన్ను చెల్లించాల్సి ఉంటుంది.

పర్యావరణ శాఖ ఆమోదంతోనే..

జిల్లాలో ఉన్న ప్రభుత్వ, పట్టా భూముల్లో గనుల తవ్వకాలకు అనుమతులు పొందాలంటే పర్యావరణ శాఖ ఆమోదం తప్పనిసరి. పర్యావరణ శాఖ, కాలుష్య నియంత్రణ మండలి శాఖల అధికారులు పరిశీలించి అనుమతి ఇస్తేనే గనుల శాఖ ఆమోద్ర ముద్ర లభిస్తోంది.

విరివిగా దరఖాస్తులు



ఖనిజ వనరులు కలిగిన ప్రభుత్వ భూముల్లో మైనింగ్ చేసేందుకు వేలం నిర్వహిస్తున్నాం. ఎర్రమట్టి భూములకు సంబంధించి దరఖాస్తులు అందాయి. పట్టా భూముల్లోనూ తవ్వకాలకు అనుమతులు ఇస్తున్నాం. ఈ ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా కొనసాగుతుంది. ఆన్‌లైన్ ద్వారానే ప్రక్రియ పూర్తి చేస్తాం. – సాంబశివరావు, ఏడీ, గనుల శాఖ

సేవలకు ఆటంకం

- సమ్మెలో పంచాయతీ జూనియర్ కార్యదర్శులు
- ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని డిమాండ్

షాబాద్: డిమాండ్ల సాధన కోసం పంచాయతీ జూనియర్ కార్యదర్శులు సమ్మెబాట పట్టారు. నాలుగేళ్ల ప్రొబేషన్ కాలం పూర్తయిన తమను వెంటనే క్రమబద్ధీకరిస్తూ జీఓ 26 అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా 558 పంచాయతీలకు గాను 306 మంది పంచాయతీ కార్యదర్శులు, 72 ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు. కార్యదర్శులు విధులకు గైర్హాజరు కావడంతో సేవలకు ఆటంకం ఏర్పడింది.

క్లుప్తంగా

ఆలయ పునఃనిర్మాణానికి విరాళం



చెక్కు అందజేస్తున్న హన్మంత్‌రెడ్డి

ధారూరు: మండల కేంద్రంలో హనుమాన్ ఆలయ పునఃనిర్మాణానికి వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జె.హన్మంత్‌రెడ్డి ఆదివారం రూ.51,111 విరాళం అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులకు పటేల్ సంజీవ్‌కుమార్, సర్పంచ్ చంద్రమౌలికి ఆయన చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు పట్లోళ్ల బసప్ప, బీఆర్ఎస్ నాయకులు హఫీజ్, ఇబ్రహీం, లింగన్‌పల్లి అశోక్, లక్ష్మయ్య, ఇనాయతుల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లు సీజ్



పోలీసులు సీజ్ చేసిన ట్రాక్టర్లు

ధారూరు: మండల పరిధిలోని కేరెళ్లి గ్రామ సమీపంలో శనివారం అర్ధరాత్రి ఎటువంటి అనుమతి లేకుండా మట్టి తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను పోలీసులు సీజ్ చేశారు. రెవెన్యూ అధికారుల సమాచారం మేరకు మొరం తరలిస్తున్న ట్రాక్టర్లను తనిఖీ చేయగా వారి వద్ద ఎటువంటి అనుమతి పత్రాలు లభించలేదు. దీంతో వాహనాలను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించామని ఎస్ఐ సంతోష్ తెలిపారు. ఈ ట్రాక్టర్లు వికారాబాద్ మండలం గొట్టిముకుల గ్రామానికి చెందినవిగా గుర్తించామని వీటిని తహసీల్దార్‌కు అప్పగిస్తామని ఆయన వివరించారు.

బోరు మోటారు, పైపుల చోరీ

కొడంగల్ రూరల్: కొత్తగా నిర్మించుకున్న ఇంట్లో బోరు మోటారు, పైపులు, విద్యుత్ తీగలను గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని శాంతినగర్ కాలనీలో నివాసం ఉంటున్న మీదింటి సంజీవ్ నూతనంగా ఇంటిని నిర్మించుకున్నాడు. ఈ నెల 7న గృహ ప్రవేశం ఉన్నందున ఇంటిని శుభ్రం చేసేందుకు వెళ్లాడు. బోరు మోటార్ ఆన్ కాకపోవడంతో.. పై కప్పు తెరిచిచూడగా బోరు మోటారు, విద్యుత్ తీగ, 250మీటర్ల లోతులో ఉన్న పైపులను ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు. దీంతో ఆదివారం ఆయన పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

వీధి కుక్కల దాడి.. వృద్ధురాలికి తీవ్రగాయాలు

పరిగి: మండల పరిధిలోని రాపోల్ గ్రామంలో వీధికుక్కల దాడిలో ఓ వృద్ధురాలు తీవ్రంగా గాయపడింది. గ్రామానికి చెందిన గండు సాయమ్మ శనివారం రాత్రి భోజనం అనంతరం ప్లేటు శుభ్రం చేసేందుకు ఆరుబయటకు వచ్చింది. దీంతో వీధి కుక్కలు ఆమెపై విచక్షణ రహితంగా దాడి చేయడంతో అచేతనంగా పడిపోయింది. గమనించిన గ్రామస్తులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వృద్ధురాలిని చికిత్స నిమిత్తం పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమించడంతో నగరంలోని ఉస్మానియా ఆస్పత్రికి రిఫర్ చేశారు. వృద్ధురాలి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు. వీధి కుక్కల నిర్మూలనకు అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

నిధులు.. విధులు శూన్యం

రైతుల కష్టాలను తెలుసుకుని వ్యవసాయాధికారులు, అన్నదాతలకు అనుసంధానకర్తలుగా నిలవాల్సిన రైతుబంధు సమితులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నాయి. ప్రభుత్వం ఆర్భాటంగా వీరిని నియమించినా క్షేత్రస్థాయిలో ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది.

- మొక్కుబడిగా రైతుబంధు సమితులు
- నామినేటెడ్ పద్ధతిలో సభ్యుల నియామకం
- బాధ్యతలపై స్పష్టత కరువు



దౌల్తాబాద్‌లోని రైతువేదిక

దౌల్తాబాద్: రాష్ట్ర ప్రభుత్వం గతంలో రైతుసమన్వయ సమితులను రైతుబంధు సమన్వయ సమితులుగా మార్చింది. గ్రామాలు, మండలాలు, జిల్లాల వారీగా విస్తరించడంతో పాటు రాష్ట్ర స్థాయిలోనూ ఓ కమిటీ ఉంది. 2018లో ఈ సమితులను ప్రారంభించినా సభ్యులకు ఎలాంటి బాధ్యతలు అప్పగించలేదు. ప్రొటోకాల్ ప్రకారం ప్రభుత్వ కార్యక్రమాల్లో మాత్రమే వీరు పాల్గొంటున్నారు. ఇప్పటి వరకు వారు రైతులకు ఎటువంటి అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు.

మండలంలో 26 కమిటీలు..

మండల పరిధిలో రైతుబంధు మండల సమన్వయ సమితి, 26 గ్రామాల్లో గ్రామసమన్వయ సమితుల కోఆర్డినేటర్లను నామినేటెడ్ పద్ధతిలో నియమించారు. ఒక్కో సమితికి 15 మంది చొప్పున గ్రామ సమితి సభ్యులు ఉన్నారు. మండల స్థాయిలో 24 మందితో కమిటీ ఏర్పాటు చేయగా అందులో ఒకరు మండల కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్నారు. జిల్లా స్థాయిలో 24 మందితో కూడిన కమిటీలోనూ ఒకరు జిల్లా కోఆర్డినేటర్‌గా నియమితులయ్యారు. జీఓ నంబర్ 39 జారీ చేసి రైతుబంధు సమితులను ఏర్పాటు చేశారు.

త్వరలో వానాకాలం సీజన్..

జూన్‌లో వానాకాలం సాగు సీజన్ ప్రారంభం కానుంది. దీంతో రైతులకు సలహాలు, సాగులో సందేహాలను నివృత్తి చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం సమితిలో నియామకమైన వారు కూడా ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం పాత వారినే కొనసాగిస్తారా.. కొత్త వారిని నియమిస్తారా? అనేది ఇంకా స్పష్టత లేదు.

ప్రయోజనం శూన్యం..

మండల వ్యాప్తంగా వ్యవసాయ క్లస్టర్ల వారీగ ఎనిమిది రైతువేదికలు ఏర్పాటు చేశారు. రైతుబంధు సమితి సభ్యులు రైతుబంధు, రైతుబీమా పథకాల అమలులో పాలుపంచుకుని గ్రామాల్లో భూసమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని రైతులు ఆశించారు. రూ.500కోట్ల నిధి ఏర్పాటు చేసిన రైతుబంధు సమితిలను బలోపేతం చేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించడంతో చాలా మంది ఆశావాహులు కమిటీల్లో స్థానం కోసం ఎగబడ్డారు. ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు వీరికి స్పష్టమైన బాధ్యతలు అప్పగించలేదు.

ఎలాంటి విధులు లేవు



నియామకం అయినప్పటి నుంచి మాకు ఎలాంటి విధుల్లేవు. వ్యవసాయ శాఖ వారు ఏదైనా సమావేశం ఉంటే తప్పా మాకు ఎలాంటి సమాచారంలేదు. నిధులు, విధులు ఉంటే బాగుంటుంది. ఈ పథకం బాగుంది కానీ విధులు, నిధులు ఉండి రైతులకు సేవ చేసే భాగ్యమే లేదు.

– భగవంతు, రైతుబంధు మండల కోఆర్డినేటర్

కార్యక్రమాలకు ఆహ్వానిస్తున్నాం



గ్రామ, మండల స్థాయిలో జరిగే కార్యక్రమాలకు కోఆర్డినేటర్లను ఆహ్వానిస్తున్నాం. ఇప్పటికే వారికి శిక్షణ పూర్తిచేశాం. నూతనంగా వారి భాధ్యతలు, విధివిధానాలపై ఎలాంటి ఆదేశాలు రాలేదు.

– లావణ్య, ఏఓ, దౌల్తాబాద్

ఎకరాకు రూ.లక్ష పంట నష్టం చెల్లించాలి

మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్



తొర్మామిడిలో అరటి తోటను పరిశీలిస్తున్న ప్రసాద్‌కుమార్

బంట్వారం: రైతులకు ఎకరాకు రూ.లక్ష చొప్పున పంట నష్టం చెల్లించాలని మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలో అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరుస ప్రకృతి వైపరీత్యాలు రైతులను వెంటాడుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. లక్షల్లో పెట్టుబడులు పెట్టిన రైతులు అప్పుల పాలైతే ప్రభుత్వం ఎకరాకు రూ.10వేల చొప్పున చెల్లిస్తామనడం విచారకరమన్నారు. నియోజకవర్గ పరిధిలో వేలాది ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని.. నష్టపోయిన ప్రతీ రైతును గుర్తించి రూ.లక్ష చొప్పున పరిహారం చెల్లించాలని కోరారు. ఉద్యాన, వ్యవసాయ శాఖల అధికారులు క్షేత్ర స్థాయిలో పంట నష్టాన్ని అంచనా వేయాలన్నారు. లేదంటే ప్రభుత్వంపై పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోచారం వెంకటేశం, డీసీసీ ఉపాధ్యక్షుడు రంగారెడ్డి, సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి చామల రఘుపతిరెడ్డి, నాయకులు నర్సింలు, తౌఫిక్, సంజీవ్, మున్నాబాయ్, గౌస్, అజీం, ఇసాక్, సలీం తదితరులు పాల్గొన్నారు.

రేపు సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణ

బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు తుల్జారాంగౌడ్



మాట్లాడుతున్న తుల్జారాంగౌడ్

మర్పల్లి: సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ కార్యక్రమ్నాఇ మే 2న పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు తుల్జారాంగౌడ్ అన్నారు. ఆదివారం ఆయన మర్పల్లి గెస్ట్‌హౌస్‌లో గౌడ సంఘం మండల అధ్యక్షుడు నాయబ్‌గౌడ్‌తో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తుల్జారాంగౌడ్ మాట్లాడుతూ.. విగ్రహావిష్కరణ కార్యక్రమానికి గౌడ కులస్తులు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు. అనంతరం ఏర్పాటు చేసే సమావేశంలో కులస్తుల సమస్యలను చర్చించి ప్రభుత్వానికి లేఖ అందించేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని సూచించారు. ఈ కార్యక్రమంలో గౌడ్ సంఘం జిల్లా కార్యదర్శి శంకరయ్యగౌడ్, మండల ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి వీరేశంగౌడ్, కార్యవర్గ సభ్యులు బలరాంగౌడ్, రమేశ్‌గౌడ్, ప్రశాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

ప్రజలకు చేరువైన 'మన్‌కీ బాత్'

బీజేపీ రాష్ట్ర నాయకుడు ప్రహ్లాదరావు

దోమ: ప్రధాని మోదీ నిర్వహిస్తున్న మన్ కీ బాత్ ఆదివారంతో వంద ఏపిసోడ్‌లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా మండల పరిధిలోని మోత్కూరు గ్రామంలో కేఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ శరత్‌కుమార్‌రెడ్డి నివాసంలో వందో ఏపిసోడ్‌ను ప్రదర్శించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు కరణం ప్రహ్లాదరావు, శరత్‌కుమార్‌రెడ్డి శుభాభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శ్రోతలకు, వీక్షకులకు మన్ కీ బాత్ కార్యక్రమం ఎంతో చేరువైందన్నారు. ఈ కార్యక్రమం ఇప్పటివరకు 100 కోట్ల మంది చూశారని, ప్రతి నెల 23 కోట్ల మంది ఆదరిస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కేఎస్ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు రాజేశ్వరమ్మ, ఆయా మండలాల అధ్యక్షులు, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాలనీవాసులతో కలిసి వీక్షించిన నాయకులు

అనంతగిరి: ప్రధాని మోదీ నిర్వహిస్తున్న మన్ కీ బాత్ 100వ ఎపిసోడ్‌ను 24వ వార్డులో బీజేపీ నాయకులు కాలనీవాసులతో కలిసి వీక్షించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీదేవిసదానందరెడ్డి, అసెంబ్లీ ఇన్‌చార్జి శ్రీధర్‌రెడ్డి, నాయకులు, కాలనీవాసులు తదితరులున్నారు.



శరత్‌కుమార్ రెడ్డి నివాసంలో మన్ కీ బాత్ వందవ ఏపిసోడ్ వీక్షిస్తున్న ప్రజలు

హక్కుల సాధనకు సమ్మెలు

- ఆందోళన బాటపడుతున్న ఉద్యోగులు
- తగ్గేది లేదంటున్న ప్రభుత్వం
- ఉన్నతాధికారుల ఒత్తిడితో సమ్మె విరమించిన ఆర్టిజన్‌లు



సమ్మె చేస్తున్న పంచాయతీ జూనియర్ కార్మికులు

తాండూరు: ప్రభుత్వ శాఖలలో పని చేస్తున్న ఉద్యోగులు, కార్మికులు సమ్మె బాట పడుతున్నారు. ఇప్పటికే పలు ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగులు సమ్మె చేపట్టారు. మరికొందరు సమ్మె బాట పట్టేందుకు సిద్ధమవుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఉద్యోగ సంఘాలు సమ్మె చేశాయి. అప్పట్లో పలు ప్రభుత్వ శాఖలలో పని చేస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం న్యాయం చేసింది. ఈ సారి అసెంబ్లీ ఎన్నికల సమయం దగ్గర పడటంతో ఉద్యోగులు, కార్మికులు హక్కుల సాధన కోసం ఆందోళన బాట పడుతున్నారు. కానీ ప్రభుత్వ హెచ్చరికలతో ఆర్టిజన్ కార్మికులు సమ్మె విరమించారు.

డిమాండ్‌లు సిద్ధం చేసుకుంటున్న సంఘాలు

జిల్లాలో పలు ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగులు, కార్మికులు సమ్మె బాట పట్టారు. ఇప్పటికే విద్యుత్ శాఖలోని ఆర్టిజన్ కార్మికులు, ఐకేపీ మహిళా సమాఖ్య సంఘం వీఓఏలు, పంచాయతీ జూనియర్ కార్యదర్శులు సమ్మె బాట పట్టారు. రానున్న రోజుల్లో పలు ప్రభుత్వ శాఖలలోని ఉద్యోగులు హక్కుల కోసం సమ్మెకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఉద్యోగులు, కార్మికులు పలు డిమాండ్‌లతో సమ్మె చేశారు. అందులో మెప్మా ఆర్పీలకు ప్రభుత్వం వేతనాలను పెంచి న్యాయం చేసింది. ఈ సారి సైతం సమ్మెతో ఉద్యోగ, కార్మిక సంఘాల నేతల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని భావించారు. పంచాయతీ జూనియర్ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలని కార్యదర్శులు సమ్మె చేస్తున్నారు. అయితే ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదు. మరోవైపు ఉపాధ్యాయులు సైతం సీపీఎస్ విధానం ఎత్తివేయడంతో పాటు పలు న్యాయమైన డిమాండ్‌లను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నారు. అయితే విద్యా సంస్థలు ప్రారంభమయ్యే సమయంలో సమ్మెకు వెళ్లే అవకాశం ఉందని ఉపాధ్యాయ సంఘాల నాయకులు అంటున్నారు. మరోవైపు రవాణ శాఖలో వాహనాలపై అధిక పన్ను వేయడంతో పాటు పలు సమస్యలపై లారీ ఓనర్స్ అసోషియేషన్ సభ్యులు సైతం డిమాండ్‌లను సిద్ధం చేసుకున్నారు.

బెడిసి కొడుతున్న వ్యూహం

ఏప్రిల్ 25 నుంచి ఆర్టిజన్ కార్మికులు సమ్మెకు దిగారు. కాగా విద్యుత్ శాఖ అధికారులు కార్మికులపై ఎస్మా చట్టం ప్రయోగించి 60 మంది ఆర్టిజన్ కార్మికులను సస్పెండ్ చేసింది. విధుల్లోకి చేరకపోతే ఉద్యోగాలను తీసేస్తామని అధికారుల నుంచి ఒత్తిడి రావడంతో తిరిగి విధుల్లో చేరారు. మరోవైపు పక్షం రోజులుగా హక్కుల కోసం వీఓఏలు సమ్మె చేస్తున్నారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఒక్కో వీఓఏకు రూ.18 వేతనంతో పాటు పలు డిమాండ్‌లు పరిష్కరించాలని సమ్మె చేస్తున్నారు. వీఓఏలు సమ్మె విరమించకపోతే మొదటికే మోసం వస్తుందని ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేసింది. దీంతో చేసేది లేక శనివారం సమ్మె విరమించారు. అయితే ప్రభుత్వ ఉద్యోగులు, కార్మికులు సమ్మెకు వెళితే ప్రభుత్వం తలొగ్గే పరిస్థితులు కనిపించడం లేదని పలువురు చర్చించుకుంటున్నారు. ఇందుకు ఆర్టిజన్ కార్మికులు, వీఓఏల సమ్మెల విరమణ అందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయంటున్నారు.

కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దింపుదాం

చేవెళ్ల: ప్రధాని మోదీ అవినీతి ప్రభుత్వాన్ని గద్దె దింపి ప్రజాస్వామ్యాన్ని, భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందామని సీపీఐ జిల్లా కార్యదర్శి పీ జంగయ్య కార్యకర్తలకు పిలుపునిచ్చారు. చేవెళ్ల మండలం కందవాడ గ్రామంలో ఆదివారం పార్టీ జెండాను ఆవిష్కరించి ఇంటింటికి సీపీఐ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ జాతీయ కమిటీ పిలుపు మేరకు మోదీ హటావో దేశ్‌కి బచావో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కార్పొరేట్ సంస్థల ఆగడాలు, ఆర్థిక దోపిడీలు అధికమయ్యాయని ఆరోపించారు. దేశ ప్రజల ఆస్తులను దోచుకుంటున్నారని తెలిపారు. కులతత్వాన్ని, మతతత్వాన్ని రెచ్చగొట్టి ప్రజల మధ్య చిచ్చు పెడుతున్నారని మండిపడ్డారు. ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. దమ్ముంటే కర్ణాటకలో ఎన్నికల ప్రచారంలో ఈ మాట చెప్పాలని ఆయన సవాల్ విసిరారు. తెలంగాణలో రిజర్వేషన్లు రద్దు చేస్తామని, కర్ణాటకలో ఇస్తామని చెప్పడం ఏంటని ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ కే రామస్వామి, కో కన్వీనర్లు ప్రభులింగం, గోపాల్‌రెడ్డి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వీ సత్యనారాయణ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సుధాకర్‌గౌడ్, నాయకులు అంజయ్య, సత్తిరెడ్డి, మక్బుల్, శ్రీనివాస్, పీ సుధీర్, మాధవి, మంజుల, విజయమ్మ, మీనాక్షి, అనురాధ, అన్నపూర్ణ, కందవాడ కార్యదర్శి బల్వంత్‌రెడ్డి, నాయకులు కృష్ణగౌడ్, రాంచందర్, బీరప్ప, వినోద, యాదమ్మ, గోపాల్, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

మేడేను విజయవంతం చేద్దాం

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రయ్య



మాట్లాడుతున్న చంద్రయ్య

బొంరాస్‌పేట: సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా సోమవారం కొడంగల్ తాలూకా కేంద్రంలో ఉదయం 10.30గంటలకు నిర్వహించే కార్యక్రమాలను విజవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులు, కర్షకులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

విషం కలిపిన కుడితి తాగి పాడిగేదెల మృతి



గేదె కళేబరం

యాచారం: మండలంలోని తక్కళ్లపల్లిలో గుర్తు తెలియని వ్యక్తులు కుడితిలో విషం కలపడంతో ఆ కుడితి తాగిన పాడి గేదెలు మృతి చెందాయి. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఎ.తిరుమల్‌రెడ్డి కొద్ది నెలల కింద రూ.4 లక్షల అప్పులు చేసి నాలుగు పాడి గేదెలను కొనుగోలు చేసి ఉపాధి పొందుతున్నాడు. రోజు మాదిరిగానే ఆదివారం ఉదయం గేదెలను వ్యవసాయ బావి వద్ద కుడితి తాగించడానికి వదిలాడు. కుడితి తాగిన గేదెలు గంటలోపు అక్కడే కుప్పకూలి మృతి చెందాయి. దీంతోమ బాధిత రైతు తిరుమల్‌రెడ్డి ఉపాధి కోల్పోయాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.

అప్పు తీర్చనన్నందుకు హతమార్చారు

- అదృశ్యమైన వ్యక్తి విగతజీవిగా..
- ఫోన్ ఆధారంగా కేసును ఛేదించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన ఎస్ఐ వెంకటేశ్ యాదవ్

తలకొండపల్లి: అదృశ్యమైన వ్యక్తి శవమయ్యాడు. ఫోన్ ఆధారంగా పోలీసులు కేసును ఛేదించారు. సీఐ ఉపేందర్, ఎస్ఐ వెంకటేశ్ యాదవ్ ఆధ్వర్యంలో సిబ్బంది నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఆదివారం ఎస్ఐ కేసు వివరాలు వెల్లడించారు. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలం, డోకూరు గ్రామానికి చెందిన చిన్న యాదయ్య, రామాంజమ్మ దంపతులు. ఉపాధి కోసం వీరు పిల్లలతో కలిసి తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామానికి వచ్చారు. పిల్లలు అరుణాచల డెవెలపర్స్‌లో కూలి పనులు చేసున్నారు. మార్చి 18వ తేదీ ఉదయం 6.30 గంటల ప్రాంతంలో చిన్న యాదయ్య సరుకులు తెచ్చేందుకు దుకాణానికి వెళ్లి తిరిగి రాలేదు. ఆందోళనకు గురైన భార్య రామాంజమ్మ కిరాణా దుకాణంలో విచారించింది. అయినా భర్త ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతుడి సెల్ ఫోన్ ఆధారంగా సీఐ ఉపేందర్, ఎస్ఐ వెంకటేశ్‌యాదవ్‌లు సాక్షులను విచారించారు. యాదయ్యకు షాద్‌నగర్‌లో సివిల్ ఇంజనీర్‌గా పని చేస్తున్న భూకలి కుమార్‌తో పరిచయం ఉంది. అవసరాల నిమిత్తం అతని వద్ద యాదయ్య రూ. 40 వేలు తీసుకున్నాడు. అప్పు ఎప్పుడు తీరుస్తావని కుమార్ అడగ్గా తాగిన మైకంలో యాదయ్య ఇష్టం వచ్చినట్లు తిట్టాడు. మార్చి 14న మరో సారి కుమార్ డబ్బు అడిగాడు. దీంతో యాదయ్య డబ్బు ఇవ్వను ఏం చేసుకుంటావో చేసుకో అని తిట్టాడు. దీన్ని మనస్సులో పెట్టుకున్న కుమార్.. యాదయ్యను అంతం చేయాలని భావించాడు. మార్చి 18వ తేదీ సాయంత్రం 4 గంటల ప్రాంతంలో కుమార్ తన బావ కారులో స్నేహితులు రాజు(బాలనగర్ మండలం, ఎక్వపల్లి), అనిల్(షాద్‌నగర్), సత్యం(హాజిపల్లి)తో కలిసి వెల్జాల్‌కు వచ్చారు. కూలి పని చేస్తున్న యాదయ్యను కారులో ఎక్కించుకున్నారు. వెల్జాల్ శివారు ప్రాంతంలోని చెట్ల పొదల్లోకి వెళ్లి మద్యం తాగారు. అనంతరం కుమార్ రూ. 40 వేల గురించి అడిగాడు. యాదయ్య తిట్టడం మొదలు పెట్టడంతో కుమార్ అతని స్నేహితులు కట్టెలతో కొట్టి యాదయ్యను హతమార్చారు. నిందితులు మృతదేహాన్ని కారులో షాద్‌నగర్ సమీపంలోని అయ్యవారుపల్లికి తెచ్చారు. అక్కడ పాడుబడిన బావిలో యాదయ్య శవాన్ని పడేసి వెళ్లిపోయారు. పోలీసులు మృతదేహాన్ని గుర్తించి బంధువులకు అప్పగించారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

అప్రమత్తతే శ్రీరామ రక్ష

వాతావరణంలో మార్పులు

- విద్యుత్ షాక్, పిడుగుపాటుకు బలవుతున్న అన్నదాతలు
- ఇటీవల పెరిగిన ప్రమాదాలు

షాబాద్: వాతావరణంలో ఒక్కసారిగా చోటు చేసుకుంటున్న మార్పులతో ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడుతున్నాయి. అంతేకాకుండా పొలాల్లో, ఇళ్ల పరిసరాల్లో పిడు గులు పడుతున్నాయి. ఇటు పిడుగులు, అటు విద్యు త్ షాక్ ప్రమాదాలతో రైతులు, పశువులు బలి అవుతున్నాయి. ఇటీవల ఇలాంటి ప్రమాదాలు పెరగడంతో రైతన్నలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉరుములు, మెరుపులు

జిల్లాలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. ఇదే సమయంలో పిడుగులు పడుతున్నాయి. వ్యవసాయ పనుల్లో రైతులు, కూలీలు, గొర్రెల కాపరులు ఎక్కువగా పిడుగుపాటుకు గురి అవుతున్నారు. జిల్లాలో పిడుగు పాటుకు ఇద్దరు మృతి చెందారు. 5 పశువులు మృత్యువాత పడ్డాయి.

జాగ్రత్తలు పాటించాలి

- ఈదురు గాలులు వచ్చే సమయంలో వ్యవసాయ పనులు త్వరగా ముగించుకోవాలి.
- వర్షం పడే సమయంలో బహిరంగా ప్రదేశాల్లో, చెట్ల కింద ఉండవద్దు.
- పశువులను కొట్టంలో కట్టేయాలి.
- పంట పొలాలకు వెళ్లేటప్పుడు విద్యుత్ కంచెలు లేకుండా చూసుకోవాలి.
- ట్రాన్స్‌ఫార్మర్ల సమీపంలో ఉండరాదు.
- విద్యుత్ స్తంభాలను తాకరాదు.
- ఇంట్లోని స్విచ్ బోర్డులను ముట్టుకోవద్దు.

రైతు సంక్షేమానికి పెద్దపీట

- ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి
- గోదాం నిర్మాణానికి భూమిపూజ



గోదాం నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. మంగళ్‌పల్లి పీఏసీఎస్ గోదాం నిర్మాణ పనులకు ఇబ్రహీంపట్నం మండలం పోచారం గ్రామంలో భూమి పూజ చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడు రైతుల పక్షాన నిలుస్తోందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందజేస్తోందన్నారు. రైతుబంధు, రైతు బీమా పథకాలు తెచ్చి అన్నదాతలకు అండగా నిలుస్తోందన్నారు. అన్నదాతలను సమన్వయం చేయడానికి రైతు సమన్వయ సమితులను ఏర్పాటు చేసి, రైతు వేదికలు నిర్మించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. రైతులు పండించిన పంటలను నిల్వ చేసుకునేందుకు గోదాంలు నిర్మించి ఆదుకుంటోందన్నారు. అలాగే సహకార సంఘాలను బలోపేతానికి కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ కే సత్తయ్య, ఇబ్రహీంపట్నం ఎంపీపీ కృపేష్, వైస్ ఎంపీపీ ఎం ప్రతాప్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఎం మహేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ రవీందర్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి మండల కో–ఆర్డినేటర్ అంజిరెడ్డి, సర్పంచ్‌లు అరుణ, అశోకవర్ధన్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.